# స్ఫూర్తినిచ్చిన ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

**త్యాగరాయగానసభ,(ఆన్‌లైన్):** తెలుగుతనంలోని తీపిదనాన్ని కొత్త విషయాలతో విప్పి చెప్పిన 'ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు' తాజాస్ఫూర్తిని పంచింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన సదస్సులో యాభై మంది వక్తలు పలు ప్రత్యేక అంశాలు వివరించారు. అమెరికాలో 40 ఏళ్ళ పైబడి నివసిస్తున్న తెలుగువారి ప్రతినిధులు పాల్గొని 'మన మాట మన సాహిత్యం' అంటూ అవధులు లేని అభిమానం కనబరిచారు. డల్లాస్‌లో స్థిరపడిన తోటకూర ప్రసాద్ చక్కని తెలుగులో మాట్లాడుతూ విదేశాల్లోని ఆంధ్రుల కుటుంబాలలో కొత్తతరానికి తెలుగు ఎందుకన్న ప్రశ్న వినిపిస్తోందంటూ మన ఉనికి ప్రగతితో పాటు కలివిడితనం పెంచగలిగేది భాష ఒక్కటే అన్నారు. కాలిఫోర్నియా బర్కిలీ యూనివర్శిటీలోని కంప్యూటర్ శాస్త్రవేత్త వేమూరి వేంకటేశ్వరరావు తెలుగుపట్ల ఎనలేని మమకారం కనబరుస్తున్న తమలాంటివాళ్లంతా కలిసి పదిలక్షల డాలర్ల మూలధనంతో ప్రత్యేకమైన బోధన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. కూడు గుడ్డ పెట్టని తెలుగు ఎందుకని ఈసడింపు ఇక్కడ యువత మనసుల్లో తొలుస్తోంది అంటూ అసలు జీవన సారం అంతా మరిచిపోతున్నారని అన్నారు. బ్రిటన్ నుంచి వచ్చిన మానసిక శాస్త్రవేత్త రామకృష్ణ మాదిన ,శ్రీకాంత అప్పలరాజు, మారిషస్‌లోని తెలుగువారి పై ప్రత్యేక అధ్యయనం చేసిన టి.ఎల్.ఎస్.భాస్కర్, ఎమెన్‌లో తెలుగుభారతి నిర్వహిస్తున్న బాలాంత్రపు వెంకటరమణ ప్రభృతులు సక్తికరమైన విశేషాలు వివరించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సెలవుదినంగా ప్రకటించిన మారిషస్, అమెరికాలో అన్నిస్థాయిల్లో తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నట్టుగా అసలు తెలుగుగడ్డపై ప్రోత్సాహం మక్కువ తరిగి పోతున్నాయన్న ఆవేదన వ్యక్తమైంది. తెలుగు రాకపోయినా స్థానిక భాషలో రాసుకుని మాటలతో పాటు పాటలు పాడటానికి సమాయత్తం అవుతున్న దూరతీరాల్లోని తెలుగు వారి అభిమానం తెలియచెపుతున్నప్పుడు శ్రోతలు పులకించిపోయారు. 230 మంది సినిమా పాట కవులు అన్ని తరహాల వారికి నోరారా కమ్మని పాటల్ని ఆలపించేలా చేసి సాహిత్యం పై ఆసక్తిపెంచిన విశేషాల్ని ఎస్.వి.రామారావు వివరించారు. పాతరోజుల్లో 80 శాతం కవిత్వం ఉంటే ఇప్పటి పాటల్లో 10 శాతం అయిపోయి ఫాస్ట్ బీట్‌తో మాట వినిపించని పాటలు వచ్చాయని వాపోతూ మంచికాలం ముందుంది అన్నారు. డాక్టర్ కె.బి.లక్ష్మి ప్రసంగిస్తూ సరళ సుందరమైన కరుణశ్రీ పద్యాలలో పువ్వుల వంటి మెత్తని భావాలతో పాటు మానవ సంబంధాలపై ఎంతోఆవేదన కనిపిస్తుందని వివరించారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలోని పార్క్‌కు కరుణశ్రీ పేరుపెట్టారు. ఒక్కో వక్త ఎంచుకున్న అంశాలు మిక్కుటంగా ఉండటంతో శ్రోతలతో పాటు ఇతర వక్తలలో ఎంతో ఆసక్తి పెంచగలిగారు. వంగూరి చిట్టెన్ రాజు అమెరికా నుంచి వచ్చి సదస్సులో పాల్గొన్న వారి వద్ద పైకం వసూలు చేసి సాహిత్య సదస్సుల్లో కొత్త ఒరవడితో పాటు అసాధారణ స్పందన సాధించారు. వసూలు చేసిన మొత్తం కన్నా పదిరెట్లు ఎక్కువ వ్యయం చేసిన వివరాలు తెలుసుకున్న సాహిత్య అభిమానులు అమెరికా ఆంధ్రుల భాషాభిమానంపై ముచ్చటించుకుంటూ అభినందనలు కురిపించారు.